## రాజస్థాన్ జల్ జీవన్ మిషన్‌లో అక్రమాలు!

**25 చోట్ల ఈడీ దాడులు**

జైపూర్, నవంబర్ 3: అసెంబ్లీ ఎన్నికల వేళ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం దాడులు చేసింది. జల్ జీవన్ మిషన్ కుంభకోణంలో మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణపై రాజధాని జైపూర్, దౌసలోని 25 చోట్లతో పాటు ఐఏఎస్ అధికారి సుబోధ్ అగర్వాల్ ఇంటిపై ఈడీ దాడులు చేసి తనిఖీలు నిర్వహించింది. సెప్టెంబర్‌లో సైతం ఈడీ ఇదే విధంగా దాడులు చేసింది. కాగా, ఈ నెల 25న రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఈ క్రమంలో విపక్షాలను లక్ష్యంగా చేసుకుని కేంద్రంలోని బీజేపీ ఇచ్చే ఆదేశాల మేరకు దర్యాప్తు సంస్థలు ఇలాంటి దాడులకు దిగుతున్నాయని రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ ఆరోపించారు. ప్రతి ఇంటికి నల్లాల ద్వారా సురక్షితమైన మంచినీటిని అందించే లక్ష్యంతో కేంద్రం జల్ జీవన్ మిషన్‌ను ప్రారంభించింది. అయితే ఈ పథకం అమలును రాజస్థాన్‌లోని పీహెచ్‌ఈ శాఖ చేపట్టింది. ఈ పథకంలో బోలెడు అవకతవకలు చోటుచేసుకున్నట్టు అధికారంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి.

## కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

**తీవ్ర నేరాభియోగాలున్న వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని పిటిషన్**

న్యూఢిల్లీ: తీవ్రమైన నేరాభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి మరోసారి నోటీసులు జారీచేసింది. రెండు వారాల్లో స్పందన తెలియజేయాలని శుక్రవారం ఆదేశించింది. తీవ్ర నేరాభియోగాలు ఎదుర్కొంటున్న అభ్యర్థులను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకొనేలా కేంద్రం, ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషనర్ కోరారు. సుప్రీంకోర్టు గత ఆదేశాలు, లా కమిషన్ సిఫార్సులు ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన 539 మందిలో 233 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని ప్రకటించారని ప్రస్తావించారు.

## డీఎంకే నేతలే లక్ష్యంగా ఐటీ సోదాలు

కరూర్, నవంబర్ 3: తమిళనాడులో మళ్లీ ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు సోదాలు జరిపారు. అధికార పార్టీ డీఎంకే నేత, మంత్రి ఈవీ వేలు, డీఎంకే దివంగత నాయకుడు వసుగి మురుగేశన్‌కు చెందిన ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. తిరువణ్ణామలైలో వేలు స్థాపించిన అరుణై ఇంజినీరింగ్ కాలేజీ, కరూర్‌లోని మురుగేశన్ సోదరి ఇంటిలో అధికారులు తనిఖీలు చేశారు. గాంధీపురంలోని ఓ ఫైనాన్స్ సంస్థ, థొట్టకురుచ్చిలోని డీఎంకేకు చెందిన ఓ నాయకుడి ఇల్లు ఇలా మొత్తం 10 చోట్ల సోదాలు జరిగాయి.

## విచారణ కమిటీ ద్వేషం నుంచి రక్షణ కల్పించాలి: మహువా

కోల్‌కతా: లోక్‌సభలో ప్రశ్నలు అడగడానికి తాను లంచం తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణకు సిద్ధమేనని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా శుక్రవారం ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అయితే పార్లమెంటు నైతిక విలువల కమిటీ స్త్రీ ద్వేషం నుంచి తనకు రక్షణ కల్పించాలని అన్నారు. ఈ కమిటీ గురువారం తనను కించపరిచేవిధంగా ప్రశ్నించిన తీరుపై లోక్‌సభ సభాపతి ఓం బిర్లాకు లేఖ రాశానని తెలిపారు. ఎంపీలు తమ ఎన్‌ఐసీ లాగిన్ ఐడీలను ఇతరులకు ఇవ్వరాదని తెలిపే నిబంధనలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు.



## రాజకీయాల్లోకి కంగనా రనౌత్!

ద్వారక: రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారన్న ఊహాగానాలకు బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ తెరదించారు. తాను రాజకీయాల్లోకి వస్తున్నట్టు సూచనప్రాయంగా అంగీకరించారు. శుక్రవారం ద్వారకలోని శ్రీ కృష్ణుడి ఆలయంలో కంగనా పూజలు జరిపారు. రాజకీయాల్లోకి వస్తున్నారా? వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారా? అన్న మీడియా ప్రశ్నకు 'ఆ కృష్ణ భగవానుడు ఆశీర్వదిస్తే తప్పక పోటీ చేస్తా' అని బదులిచ్చారు.

# 'కిస్సా కుర్సీ కా'

## కర్ణాటకలో కాబోయే సీఎం నేనంటే నేనంటున్న కాంగ్రెస్ నేతలు

- సీఎం కావాలనుంది : హోంమంత్రి పరమేశ్వర
- అధిష్ఠానం కోరితే సీఎం అవుతా : ప్రియాంక్ ఖర్గే
- సీఎం రేసులోకి దూసుకొస్తున్న రోజుకో నేత
- పడకేసిన పాలన.. కుర్చీల కొట్లాటలో నేతలు



సిద్ధరామయ్య, డీకే శివకుమార్



పరమేశ్వర, ప్రియాంక్ ఖర్గే

బెంగళూరు, నవంబర్ 3: కర్ణాటకలో కుర్చీలాట రసకందాయంలో పడింది. ఇన్నాళ్లు సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్యే అధికారం కోసం పోటీ ఉండగా, ఇప్పుడు ఏకంగా అరడజనుకు పైగా నేతలు తెరపైకి వచ్చారు. సీఎం కుర్చీ నాదే అంటూ రోజుకో నేత తెరపైకి వస్తున్నాడు. దీంతో కర్ణాటక రాజకీయం మొత్తం సీఎం కుర్చీ చుట్టే తిరుగుతున్నది. పాలన పడకేసింది. కుర్చీలు కాపాడుకోవటానికే ప్రాధాన్యమిస్తూ పరిపాలనను గాలికొదిలేశారు. దీంతో కరెంటు, తాగునీరు కూడా కరువై ప్రజలు హాహాకారాలు చేస్తున్నారు.

**అందరూ సీఎం అభ్యర్థులే!**

బీజేపీ పాలనతో విసిగెత్తి కాంగ్రెస్‌కు అధికారం అప్పజెప్పిన కర్ణాటక ప్రజల పరిస్థితి ఐదు నెలలకే అగమ్యగోచరంగా తయారైంది. ప్రభుత్వ పాలన, అభివృద్ధి, సంక్షేమం..ఇవేవీ ఆ రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్‌కు పట్టడం లేదు. ఐదేండ్లు సీఎంగా తానే ఉంటానని సిద్ధరామయ్య ప్రకటించిన మరుసటి రోజే, రాష్ట్ర హోంమంత్రి జీ పరమేశ్వర, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కుమారుడు, మంత్రి ప్రియాంక్ ఖర్గే సీఎం పదవిని తాము ఆశిస్తున్నట్టు ప్రకటించారు. పార్టీ హైకమాండ్ కోరితే సంతోషంగా సీఎం పదవి స్వీకరిస్తానని ప్రియాంక్ ఖర్గే శుక్రవారం చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ఇదే అంశంపై సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న తుముకూరులో స్పందిస్తూ 'రేపు ఏమైనా జరగవచ్చు' అని నర్మగర్భంగా మాట్లాడారు. హోంమంత్రి జీ పరమేశ్వర శుక్రవారం దీనిపై మాట్లాడారు. 'ఒకవేళ అదృష్టం నావైపుంటే కచ్చితంగా సీఎం పదవిని కోరుకుంటా. పదవిపై నా ఆశ రహస్యమేమీ కాదు. అయితే ఇది ఎప్పుడు జరుగుతుందన్నది తెలియదు. సీఎం కావాలని పార్టీలో ఎంతోమంది ఆరాటపడుతున్నారు' అని అన్నారు. సీఎంను మార్చాలా? లేదా? అన్నది ఢిల్లీలో 'ఆ నలుగురు' వ్యక్తులు నిర్ణయిస్తారని ప్రియాంక్ ఖర్గే అభిప్రాయపడ్డారు. మోదీ సర్కార్ కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్‌ను కూల్చేందుకు ఆపరేషన్ లోటస్‌ను చేపట్టిందని, ఏ క్షణంలోనైనా ఎమ్మెల్యేల ఫిరాయింపు ఉంటుందన్న ఊహాగానాలు రాష్ట్రంలో చక్కర్లు కొడుతున్నాయి. దీనిని ఎదుర్కొనేందుకు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే సీఎం మార్పు ఉంటుందని కాంగ్రెస్ నాయకుల మధ్య చర్చ నడుస్తున్నది.

# కరెంట్ ఇవ్వలేం!



రామలింగారెడ్డి

- కర్ణాటకలో విద్యుత్తు కష్టాలు వాస్తవమే
- అంగీకరించిన మంత్రి రామలింగారెడ్డి
- రాష్ట్ర రైతులకు 7 గంటల విద్యుత్తు ఇవ్వలేకపోతున్నామని వ్యాఖ్య

బెంగళూరు, నవంబర్ 3: కర్ణాటకలో కరెంట్ కష్టాలు తీవ్రస్థాయికి చేరాయి. విద్యుత్తు సరఫరా లేక పంటలు ఎండిపోతుండటంతో అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. ఎడాపెడా కరెంట్ కోతలతో గ్రామాల్లో తాగు నీరు దొరకడం కూడా కష్టంగా మారిందనే వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలో కరెంట్ సంక్షోభం నెలకొన్న విషయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, కాంగ్రెస్ నేత రామలింగారెడ్డి స్వయంగా అంగీకరించారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తు ఇస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీనిచ్చిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్ర రైతాంగానికి 7 గంటల కరెంట్ కూడా ఇవ్వలేకపోతున్నామని మంత్రి రామలింగారెడ్డి తాజాగా ఓ మీడియా ప్రతినిధి ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పేర్కొన్నారు. 5 గంటల కరెంట్ తమకు చాలడం లేదని కర్ణాటక రైతులు చేస్తున్న ఆందోళనలపై జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. కర్ణాటకలో కరెంట్ కష్టాలు వాస్తవమేనన్న విషయాన్ని అంగీకరించారు. రాష్ట్రంలో సరిగా వర్షాలు పడలేదని, డ్యాముల్లో నీరు లేదని అన్నారు. దీని కారణంగా విద్యుత్తు ఉత్పత్తి కావడం లేదని, 7 గంటల విద్యుత్తు ఇవ్వలేకపోతున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే రోజుల్లో పక్క రాష్ట్రాల నుంచి కరెంట్ కొని రైతులకు కరెంట్ ఇస్తామని పేర్కొన్నారు.

**కరెంట్ కోసం రోడ్లపైకి అన్నదాతలు**

విద్యుత్తు విషయంలో హస్తం పార్టీ రాష్ట్రంలో రైతులను నిలువుగా మోసం చేసిందనే విమర్శలు వస్తున్నాయి. వ్యవసాయానికి సరిపడా నాణ్యమైన కరెంట్ ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కీలకమైన ఈ హామీ విషయంలో యూటర్న్ తీసుకొని రైతన్నకు అరకొరగా, అది కూడా ఎడాపెడా కోతలతో కరెంట్ ఇస్తున్నది. రోజులో విడతల వారీగా ఐదు గంటల కరెంట్ ఇస్తాం.. పండుగ చేస్కోండి' అనే విధంగా కాడి వదిలేసి ఆ పార్టీ మంత్రులు, నేతలు ప్రకటనలు చేస్తుండటంపై అన్నదాతలు మండిపడుతున్నారు. సరిపడా కరెంట్ రాక, నీళ్లు పారక పలుచోట్ల పంటలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కోతల్లేని విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ పలు జిల్లాల్లో రైతులు విద్యుత్తు కార్యాలయాల ముందు ఆందోళనలు కూడా నిర్వహించారు. పలు రూపాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**రాజస్థాన్‌లోనూ విద్యుత్తు సంక్షోభం!**


మరోవైపు కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్‌లోనూ కరెంట్ సంక్షోభం నెలకొన్నది. కరెంట్ కొరత, అధిక విద్యుత్తు ధరల కారణంగా రాష్ట్రంలో కీలకమైన మార్బుల్ పరిశ్రమ ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. ఆసియాలోనే అతిపెద్ద మార్బుల్ మార్కెట్‌గా పేరుగాంచిన కిషన్‌గఢ్‌లో యాజమాన్యాలు కరెంట్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

## మోసపూరిత హామీలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్




హైదరాబాద్(నమస్తే తెలంగాణ): మోసపూరిత హామీలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. కర్ణాటకలో 5 గంటలు మాత్రమే విద్యుత్తు సరఫరా చేస్తున్నామని మంత్రి చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం కల్వకుంట్ల కవిత ఎక్స్‌లో స్పందించారు. 65 ఏండ్లపాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ రైతుల ఉసురు తీసుకున్నదని, ఇప్పుడు మరోసారి మభ్యపెట్టడానికి బయలుదేరిందని విమర్శించారు. 'కర్ణాటకలో 5 గంటల కరెంట్ ఇస్తున్నారు. తెలంగాణలో 3 గంటల కరెంటు చాలని పీసీసీ అధ్యక్షుడు అన్నారు. దీన్ని బట్టి కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణలో 3 గంటల కరెంటే వస్తుందని చెప్పడంలో సందేహమే లేదు' అని పేర్కొన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తూ అండగా నిలుస్తున్నారని తెలిపారు. రైతులపై ప్రేమ, చిత్తశుద్ధి ఉన్న నేత సీఎం కేసీఆర్ అని, అన్నదాతల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు.

## పదేండ్లలో తేడా కనిపించిందా?!




2012లో 'కుంభకోణాలకు రాజధాని హైదరాబాద్' అంటూ ప్రఖ్యాత మ్యాగజీన్ 'అవుట్‌లుక్' ప్రచురించిన కథనం. ఇదీ నాటి కాంగ్రెస్ పాలన.




2023లో 'వ్యాక్సిన్, ఏఐ, ఫార్మా, లైఫ్‌సైన్సెస్, ఇన్వెస్ట్‌మెంట్లు, ఐటీకి క్యాపిటల్‌గా హైదరాబాద్' మారిందంటూ పలు జాతీయపత్రికల్లో వచ్చిన కథనాలు ఇవి. ఇదీ నేటి బీఆర్‌ఎస్ పాలన. –స్పెషల్ టాస్క్‌బ్యూరో, నమస్తే తెలంగాణ

# రుణమాఫీపై కాంగ్రెస్ మోసం



**అందుకే ఆ పార్టీని వదిలివేశా**

- మధ్యప్రదేశ్‌లో రైతులను కాంగ్రెస్ మోసం చేసింది
- 26 లక్షల నకిలీ రుణమాఫీ పత్రాలను రైతులకు ఇచ్చింది
- ఈ పాపంలో నన్నూ భాగస్వామిగా మార్చింది: సింధియా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): కేంద్ర మంత్రి, బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాన్ని బయటపెట్టారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ రూ.2 లక్షల వరకు రైతు రుణాలు మాఫీ చేస్తామని నమ్మించి, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అధికారం చేపట్టిన 10 రోజుల్లోనే రూ.2 లక్షల వరకు రైతుల వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని, రుణమాఫీ చేయకపోతే సీఎంను మార్చేస్తామని నమ్మించారన్నారు. 15 నెలల వరకు రైతు రుణమాఫీ గురించి పట్టించుకోలేదన్నారు. ఒత్తిడి రావడంతో చేసేది లేక కాంగ్రెస్ ప్రభుత్వం 26 లక్షల నకిలీ రుణమాఫీ పత్రాలను రైతులకు ఇచ్చిందన్నారు. వాటి వల్ల రైతులకు ఒక రూపాయి కూడా ఉపశమనం కలగలేదన్నారు. అప్పట్లో తాను కాంగ్రెస్‌లోనే ఉండటంతో ఆ పాపంలో తనను కూడా భాగస్వామిని చేసిందన్నారు. అందుకే తాను ఆ పార్టీని వీడానన్నారు. సీనియర్ కాంగ్రెస్ నేతలు, మాజీ ముఖ్యమంత్రులు కమల్‌నాథ్, దిగ్విజయ్ సింగ్‌ల గురించి తన కన్నా ఎక్కువ ఎవరికీ తెలియదన్నారు. 20 ఏళ్ల పాటు వారితో సహవాసం చేయడంతో వారి మోసాలు తనకు బాగా తెలుసన్నారు. కాంగ్రెస్ పాలనలో మధ్యప్రదేశ్ రోగాల ప్రదేశ్‌గా ఉండేదని, రోడ్లన్నీ గుంతలతో ఉండేవని అన్నారు. విద్యుత్తు కోతలతో, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. విద్య, వైద్యం వంటి కనీస సదుపాయాలు ఉండేవి కాదని చెప్పారు. అప్పట్లో రాష్ట్రంలో 15 నెలలపాటు కోతలు, కమీషన్లు, అవినీతి ప్రభుత్వం ఉందన్నారు. కమల్‌నాథ్, దిగ్విజయ సింగ్‌లను జై–వీరు అని అభివర్ణిస్తున్నారని, 'షోలే' సినిమాలో జై, వీరు దొంగతనాలు, మోసాలు చేస్తూ ఉంటారని గుర్తు చేశారు.

# బఘేల్‌కు 508 కోట్లు!

- బెట్టింగ్ యాప్ నుంచి ఛత్తీస్‌గఢ్ సీఎంకు నిధులు
- ఈడీకి వాంగ్మూలమిచ్చిన యాప్ కొరియర్
- కొరియర్ నుంచి 5 కోట్ల నగదు సీజ్
- బినామీ బ్యాంక్ ఖాతాల్లో మరో రూ.10 కోట్లు



బఘేల్

న్యూఢిల్లీ, నవంబర్ 3: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మరో నాలుగు రోజుల్లో ఉందనగా ఆ రాష్ట్రంలో పెను సంచలనం చోటుచేసుకుంది. ఆ రాష్ట్ర సీఎం భూపేష్ బఘేల్‌కు రూ.508 కోట్ల రూపాయలు బెట్టింగ్ యాప్ (మహదేవ్ యాప్) ప్రమోటర్ల నుంచి అందాయన్న వార్తలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ చేపట్టింది. ఈ వ్యవహారానికి సంబంధించి భూపేష్ బఘేల్‌పై ఈడీ శుక్రవారం సంచలన ఆరోపణలు చేసింది. భారీ మొత్తంలో నగదును తరలించేందుకు మహదేవ్ యాప్ ప్రమోటర్లు యుఏఈ నుంచి అసీం దాస్ అనే కొరియర్‌ను రాయపూర్‌కు పంపగా, అతడిని ఈడీ గురువారం పట్టుకుంది. ఫోరెన్సిక్ పరీక్షలు జరపగా.. మహదేవ్ యాప్ ప్రమోటర్లు ఛత్తీస్‌గఢ్‌లోని 'బఘేల్' అనే రాజకీయ నాయకుడికి రూ.508 కోట్లు ముట్టజెప్పారని అసీం దాస్ ఈడీకి వాంగ్మూలం ఇచ్చాడు. దీనిపై తదుపరి విచారణ చేపడతున్నామని ఈడీ అధికారులు వెల్లడించారు.

**ఎస్‌యూవీ వాహనంలో నోట్ల కట్టలు**

గురువారం రాయపూర్, భిలాయ్ నగరాల్లో చేపట్టిన దాడుల్లో మొత్తం రూ.14.92 కోట్లను ఈడీ సీజ్ చేసింది. రాయపూర్‌లోని ఓ హోటల్ పార్కింగ్ ఏరియాలో ఉన్న ఎస్‌యూవీ కారులో రూ.3.12 కోట్ల నగదు పట్టుబడింది. భిలాయ్‌లో మరోచోట దాచిపెట్టిన రూ.1.8 కోట్లను కూడా ఈడీ స్వాధీనం చేసుకుంది. కోట్ల రూపాయల్ని తరలించేందుకు యుఏఈ నుంచి వచ్చిన కొరియర్ అసీం దాస్‌ను, అతడితోపాటు ఓ కానిస్టేబుల్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంది. మహదేవ్ యాప్ ప్రమోటర్లకు చెందిన బినామీ బ్యాంక్ ఖాతాల్లోని రూ.10 కోట్లను ఈడీ సీజ్ చేసింది. 'ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ ఖర్చుల కోసం యాప్ ప్రమోటర్లు తనను పంపారని విచారణలో అసీం దాస్ తెలిపాడు' అంటూ ఈడీ పేర్కొన్నది.

**నా ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమిది: బఘేల్**

ఈడీ తాజా ఆరోపణల్ని ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ బఘేల్ తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఈడీ తన ప్రతిష్టను దెబ్బ తీసేందుకు అత్యంత దారుణమైన ప్రయత్నాలు చేస్తున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.




## 'వాట్సాప్ డాటా భద్రత బాధ్యత సబ్‌స్క్రైబర్‌దే'

న్యూఢిల్లీ : ఓ ఫోన్ నంబరుతో అనుసంధానమైన వాట్సాప్ డాటా దుర్వినియోగం కాకుండా నిరోధించే బాధ్యత సబ్‌స్క్రైబర్‌దేనని సుప్రీంకోర్టు తెలిపింది. ఆ ఫోన్ నంబరు డీయాక్టివేట్ లేదా డిస్కనెక్ట్ అయినపుడు, దాని వాట్సాప్ డాటా దుర్వినియోగమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అక్టోబరు 30న కోర్టు డిస్మిస్ చేసింది. ఏదైనా ఫోన్ నంబరును సబ్‌స్క్రైబర్ విజ్ఞప్తి మేరకు డీయాక్టివేట్ లేదా డిస్కనెక్ట్ చేసినపుడు, ఆ నంబరును మరొకరికి కేటాయించడానికి కనీసం 90 రోజుల వ్యవధి ఉంటుందని ట్రాయ్ తాను సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపింది. ఓ మొబైల్ ఫోన్‌లోని వాట్సాప్ అకౌంట్ 45 రోజులపాటు ఇనాక్టివ్‌గా ఉండి, ఆ తర్వాత అదే నంబరుతో వాట్సాప్ అకౌంట్ వేరొక మొబైల్ డివైస్‌లో ప్రారంభమైతే, అంతకు ముందు డివైస్‌లోని డేటాను తొలగిస్తామని వాట్సాప్ హెల్ప్ సెంటర్‌లో పేర్కొన్నారు. వీటిని పరిశీలించిన సుప్రీంకోర్టు వ్యక్తిగత గోప్యతను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మొదటి సబ్‌స్క్రైబర్‌దేనని చెప్పింది.

# వారసులొచ్చారు

- కాంగ్రెస్, బీజేపీలకు అలవిమాలిన బంధుప్రీతి
- మధ్యప్రదేశ్‌లో 40 మందికి అసెంబ్లీ టికెట్లు




(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం విషయంలో తామేమీ తక్కువ కాదని ఈ ఎన్నికల టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్, బీజేపీ మరోసారి రుజువు చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ రాజకీయాలు నడుస్తున్నాయంటూ సీఎం కేసీఆర్‌పై దుమ్మెత్తిపోసే కాంగ్రెస్, బీజేపీలు తమ వద్ద కొచ్చేసరికి 'చెప్పేటందుకే నీతులు' అన్నట్టు వ్యవహరిస్తున్నాయి. మధ్య ప్రదేశ్‌లో ఈ రెండు పార్టీలు 40 మందికి పైగా, రాజస్థాన్‌లో ఇప్పటికి 29 మంది వారసులను ఎన్నికల బరిలోకి దింపాయి.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ తమ వారికి అధిక టికెట్లు కేటాయించింది. మాజీ సీఎం కైలాష్ జోషీ కుమారుడు దీపక్ జోషి దేవాస్, మాజీ ముఖ్యమంత్రి అర్జున్ సింగ్ కుమారుడు అజయ్ సింగ్, మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ కుమారుడు జయవర్ధన్ సింగ్, దిగ్విజయ్ సింగ్ తమ్ముడు లక్ష్మణ్ సింగ్, మాజీ ఉప ముఖ్యమంత్రి, దివంగత సుభాష్ యాదవ్ కుమారుడు సచిన్ యాదవ్‌లకు ఆ పార్టీ టికెట్లిచ్చింది. మరోవైపు బీజేపీ మాజీ ముఖ్యమంత్రి వీరేంద్ర సఖ్లేచా కుమారుడిని ఖాతేగావ్ అసెంబ్లీ బరిలో దించింది. మాజీ ముఖ్యమంత్రి గోవింద్ నారాయణ సింగ్ కుమారుడు ధృవ్ నారాయణ్ సింగ్, మనమడు విక్రమ్ సింగ్, మాజీ ముఖ్యమంత్రి సుందర్‌లాల్ పట్వా అల్లుడు సురేంద్ర పటా, మాజీ ముఖ్యమంత్రి ఉమా భారతి అల్లుడు రాహుల్ సింగ్ లోధీ, మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ గౌర్ కోడలైన కృష్ణా గౌర్, మాజీ ప్రతిపక్ష నాయకుడు నాయకుడు సత్యదేవ్ కటారే కుమారుడు హేమంత్ భిండె, కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్‌లకు బీజేపీ అసెంబ్లీ టికెట్లు కేటాయించింది.

**రాజస్థాన్‌లో 29 మందికి...**

రాజస్థాన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్, బీజేపీలు కలిపి 29 మంది వారసులను ఎన్నికల రంగంలోకి దింపాయి. ఇప్పటికి ప్రకటించిన అభ్యర్థుల్లో బీజేపీకి చెందిన ప్రముఖ నేతల బంధువులు 11 మంది ఉండగా, కాంగ్రెస్ అభ్యర్థులు 18 మంది రాజకీయ కుటుంబాల వారే.




## వారు దేవుళ్లలా ప్రవర్తిస్తున్నారు

**కలెక్టర్, పోలీస్ కమిషనర్లపై గుజరాత్ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు**

అహ్మదాబాద్ : పోలీస్ హెల్ప్‌లైన్ కోసం అధికారులు ప్రచారం చేసిన తీరుపై గుజరాత్ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్ లాంటి ఉన్నతాధికారులు తామేదో దేవుళ్లలా ప్రవర్తిస్తున్నారంటూ తీవ్రంగా వ్యాఖ్యానించింది. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని విమర్శించింది. ప్రజల ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ గురించి, దాని హెల్ప్‌లైన్ గురించి సామన్యులకు అర్థమయ్యేలా స్పష్టంగా తెలియజేయాలని చీఫ్ జస్టిస్ సునీతా అగర్వాల్, జస్టిస్ అనిరుద్ధ పి మయీలతో కూడిన ధర్మాసనం పోలీస్ శాఖను ఆదేశించింది. పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించడం సామాన్యుడికి అంత సులభం కాదని, కమిషనర్ కార్యాలయం అందని స్థాయిలో ఉన్నదని సీజే వ్యాఖ్యానించారు. అన్యాయాన్ని ఎవరికి ఫిర్యాదు చేయాలో పౌరులకు తెలియడం లేదని అన్నారు.

## అయోధ్య సందర్శనకు తీసుకెళ్తాం

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో బీజేపీ హిందూత్వ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నది. తమకు ఓటేసి గెలిపిస్తే.. రాష్ట్ర ప్రజలను అయోధ్య రామమందిర సందర్శనకు తీసుకెళ్తామంటూ శుక్రవారం విడుదల చేసిన మ్యానిఫెస్టోలో పేర్కొన్నది. 'మోదీ గ్యారంటీల' పేరుతో అమిత్‌షా విడుదల చేసిన మ్యానిఫెస్టోలో 20 రకాల హామీలను పేర్కొన్నారు.

## ధన్‌కర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పండి

**ఆప్ ఎంపీ చద్దాకు సుప్రీం సూచన**

న్యూఢిల్లీ: రాజ్యసభ చైర్మన్ ధన్‌కర్‌ను కలిసి బేషరతుగా క్షమాపణ కోరాలని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దాకు సుప్రీంకోర్టు సూచించింది. ఢిల్లీ సర్వీసెస్ బిల్లుపై పెట్టిన తీర్మానంలో అనుమతి లేకుండానే తమ పేర్లు జత చేశారని కొందరు ఎంపీలు ధన్‌కర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో చద్దాను ధన్‌కర్ నిరవధికంగా సస్పెండ్ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ చద్దా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. క్షమాపణ కోరితే చైర్మన్ సానుభూతి చూపే అవకాశముందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.